
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY




కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 13 ఏప్రిల్ 2024 | 5

సామర్లకోటలో వాహన తనిఖీల్లో రూ.12.67 లక్షలు స్వాధీనం 7లో

రుణాలు ఇప్పిస్తామని మోసం

- లక్షల్లో సొమ్ములు కోల్పోయామని బాధితుల ఫిర్యాదు 7లో

రాజకీయ వలంటీర్లు



- ఎన్నికల కమిషన్ జోక్యంతో అడ్డుకట్ట వేసినా..
- తొలగింపబడినవారు, రాజీనామాలు చేసిన వారు వైసీపీ సేవలోకి..
- ఎన్నికల ప్రచారంలో కార్యకర్తల కంటే వలంటీర్లే కీలకం
- అధికార పార్టీ సేవల్లో పునీతులవుతున్న వైనం

సామర్లకోట, ఏప్రిల్ 12: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా వలంటీర్లు పట్టించుకుంటున్న పరిస్థితి లేకుండా పోయింది. వలంటీర్లు రాజకీయ నాయకులతో కలిసి పర్యటించరాదని స్పష్టమైన ఆదేశాలు సీఈసీ ఇచ్చినా లెక్కచేయడం లేదు. నిబంధనలు తమకు వర్తించవనే ధృక్పథంతో అధికారపార్టీకి అనుకూలంగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల కమీషన్ జోక్యంతో వలంటీర్లను పింఛన్ల పంపిణీ విధులకు దూరంగా పెట్టారు. వారి స్థానంలో పింఛన్ల పంపిణీని సచివాలయాల సిబ్బందితో బుధవారంనుంచి మూడురోజులపాటు బట్వాడా చేసేలా చర్యలు చేపట్టింది. అయినా బరితెగించిన కొందరు వలంటీర్లు వైసీపీ నాయకుల సేవలో నిమగ్నమయ్యారు. మరికొందరు అధికార ప్రభుత్వానికి పరోక్షంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

సామర్లకోట, పెద్దాపురం మండలాలు, రెండు పట్టణాలకు చెందిన వలంటీర్లను ఆయా సచివాలయాల అధికారులే వైసీపీ నాయకుల వద్దకు వెళ్లమనడంతో వారి సూచనల మేరకు ఆయా వలంటీర్ల పరిధిలో ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపుతున్నారు, వ్యతిరేకత వ్యక్తం చేసేవారెవరు, వారికి ఏమేమి పథకాలు వస్తున్నాయి తదితర సమాచారాన్నివారే వైసీపీ నాయకులకు అందజేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే అధికారికంగా సేవా మిత్రల పేరిట రూ.10వేలు ఒక్కొక్క వలంటీరుకు అందజేయగా పార్టీ తరపున మరో రూ.5వేల వరకూ అందజేసినట్లు సమాచారం. తాము చెప్పినట్లు ఓటర్లను వైసీపీ వైపు మళ్లించేలా చేస్తే ఇదే మొత్తాన్ని ఎన్నికలు ముగిసిన అనంతరం మీకు అందుతుందని కొందరు నాయకులు వలంటీర్లకు భరోసా కల్పిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఇంటి పన్నుల బకాయిల వసూళ్ల పేరిట వలంటీర్లు ఇంటింటికీ పర్యటిస్తుండడం గమనార్హం. పన్నుల వసూళ్లలో మున్సిపల్ బిల్ కలెక్టర్లు, తదితర రెవెన్యూ సిబ్బంది ఉన్నా వారెవరూ పన్నుల వసూళ్ల జోలికి వెళ్లకపోవడంతో వలంటీర్లు ఏ పని మీద ఇంటింటికీ తిరుగుతున్నారో అర్థమవుతోంది.

మున్సిపాల్టీల్లో వలంటీర్లతోపాటు మెప్మా సీఆర్పీలు సైతం ఇదే పనిమీద డ్వాక్రా మహిళలతో మమేకమవుతున్నారు. డ్వాక్రా రుణాలు మంజూరు, స్త్రీనిధి సాయం తదితర ప్రభుత్వ లబ్ధి తామే చేకూరుస్తామని సీఆర్పీలు వార్డుల్లో పర్యటిస్తూ మహిళలను అధికార పార్టీ వైపు మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. వీరికి పరోక్షంగా సచివాలయాల సిబ్బంది సైతం సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వీటిని క్షేత్రస్థాయిలో ఎదుర్కొనే సాహసాలు నిరోధించే ఎంసీసీ అధికారులు మౌనం దాలుస్తున్నారన్న ఆరోపణలు ఇప్పటికే జనసేన నాయకులు జిల్లా అధికారులకు వివరించినట్లు సమాచారం. ఎన్నికల నియమావళికి అది భిన్నం. వలంటీర్లు గ్రామాల్లో కేవలం ప్రభుత్వ కార్యకలాపాలను మాత్రమే నిర్వహించాలి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత వారు ఆ కార్యకలాపాలకు దూరంగా ఉంచాలని సీఈసీ ఆదేశించారు. ఈ నేపథ్యంలో వారు అధికారిక కార్యకలాపాలు నిర్వహించడంలేదు. అధికారుల ఆదేశాలను ధిక్కరించి ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ అధికారికంగా పన్నుల వసూళ్లకు వచ్చామని అంటూనే అసలు విషయం తెరపైకి తెస్తున్నారు. ఎన్నికల కమిషన్ అధికారులు వలంటీర్లను విధులనుంచి తొలగించినా తిరిగి మన ప్రభుత్వం వచ్చేస్తుందని, మీ ఉద్యోగాలు తిరిగి మీకే వచ్చేలా చూస్తామని అధికార పార్టీ నాయకులు ఒత్తిళ్లు తెస్తున్నట్లు తెలిసింది.

వలంటీరర్ విధుల నుంచి తొలగింపు

పెద్దాపురం, ఏప్రిల్ 12: మండల పరిధిలోని కట్టమూరు సచివాలయం 2 పరిధిలో వలంటీరు తోట రవిని విధులనుంచి తొలగించినట్లు ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. ఓపార్టీకి చెందిన కండువాను మెడలో వేసుకుని ప్రచారంలో పాల్గొన్నట్లు తమకు ఫిర్యాదు అందిందని, దీనిపై విచారణచేయగా నిర్ధారణ కావడంతో అతడ్ని విధులనుంచి తొలగించామన్నారు.

జిల్లాలో పెద్దఎత్తున వలంటీర్ల రాజీనామా

కిర్లంపూడిలో 99మంది..

కిర్లంపూడి, ఏప్రిల్ 12: మండలంలో 99మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు కిర్లంపూడి ఎంపీడీవో బడే రాజేశ్వరరావు తెలిపారు. వేలంక 11, శృంగరాయునిపాలెం 16, రామకృష్ణాపురం 7, కృష్ణవరం 10, పాలెం 7, గోనేడ 6, బూరుగుపూడి 10, వీరవరం 31మంది రాజీనామాలు చేశారని ఆయన చెప్పారు.

పెద్దాపురంలో 21మంది..

పెద్దాపురం ఏప్రిల్ 12: పెద్దాపురం మున్సిపాల్టీలో 21మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. వ్యక్తిగత కారణాల రీత్యా తామంతా రాజీనామాలు చేస్తున్నట్లు తెలిపారని ఆమె పేర్కొన్నారు.

ప్రత్తిపాడులో 32మంది..

ప్రత్తిపాడు, ఏప్రిల్ 12: ప్రత్తిపాడు రాచపల్లి గ్రామ పరిధి 2 సచివాలయాలకు చెందిన 32మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు.



రౌతులపూడిలో రాజీనామాలు చేసిన వలంటీర్లు

రౌతులపూడిలో 50మంది..

రౌతులపూడి, ఏప్రిల్ 12: రౌతలపూడిలో 50మంది, ఎస్.పైడిపాలలో 12మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. ఈ లేఖలను సచివాలయ కార్యదర్శికి అందజేశారు. రౌతులపూడిలో వలంటీర్లు వైసీపీ నేతలతో కలిసి వచ్చి రాజీనామాలు అందజేశారు.

పిఠాపురం మండలంలో 23మంది..

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 12: పిఠాపురం మండలం వెల్దుర్తి, పి.రాయవరం గ్రామాలకు చెందిన 23మంది వలంటీర్లు రాజీనామా చేశారు. అధికారులకు రాజీనామాలు అందజేస్తున్నట్లు చెప్పారు.

జగ్గంపేట, ఏప్రిల్ 12: జగ్గంపేట మండలం మల్లిశాలలో వలంటీర్లు శుక్రవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు.

మళ్లీ బాలికలదే పైచేయి

- ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదల
- ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 60శాతం
- సీనియర్ ఇంటర్‌లో 71శాతం ఉత్తీర్ణత

కాకినాడ రూరల్, ఏప్రిల్ 12: జిల్లాలో ఇంటర్ పరీక్షా ఫలితాల్లో మళ్లీ బాలికలే పైచేయి సాధించారు. గతేడాదితో పోలిస్తే సాధారణ ఫలితాలు మొదటిఏడాది ఒక శాతం, రెండో ఏడాది రెండు శాతం పెరిగాయి. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను తాడేపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో శుక్రవారం బోర్డు కార్యదర్శి సౌరబ్‌గౌర్ విడుదల చేశారు. కాకినాడ జిల్లాలో మొత్తం జూనియర్ ఇంటర్ పరీక్షలకు 19,656మంది విద్యార్థులు హాజరుకాగా 11,873మంది ఉత్తీర్ణులైనట్లు డీఐఈవో జీజీకే నూకరాజు తెలిపారు. వారిలో బాలురు 4800మంది, బాలికలు 7073మంది ఉన్నారన్నారు. మొత్తం 60శాతం మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. గతేడాది ఫస్టియర్ 59శాతం ఉత్తీర్ణులయ్యారు. సీనియర్ ఇంటర్ పరీక్షలకు 15,969మంది విద్యార్థులు హాజరుకాగా 11,337మంది ఉత్తీర్ణులు కాగా 71శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. వారిలో 4476మంది బాలురు, 6861మంది బాలికలు ఉన్నారని తెలిపారు. గతేడాది సెకండియర్‌లో 69శాతం ఉతీర్ణులయ్యారు. జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సర ఒకేషనల్ పరీక్షలకు 1631మంది హాజరుకాగా 943మంది, ద్వితీయ సంవత్సర ఒకేషనల్ పరీక్షలకు 1121మంది హాజరు కాగా 822మంది ఉత్తీర్ణులవగా ప్రథమ సంవత్సర ఫలితాల్లో 58శాతం, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 73శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు డీఐఈవో తెలిపారు. మొత్తం ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను మే 24 నుంచి జూన్ 1వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు సమాచారం.

ఇంటర్‌లో 63శాతం ఉత్తీర్ణత

- జిల్లాలో గొల్లప్రోలు కళాశాలకు ప్రథమస్థానం

గొల్లప్రోలు, ఏప్రిల్ 12: గొల్లప్రోలు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తీర్ణతలో జిల్లాలోని ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో ప్రథమస్థానంలో నిలిచారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 63శాతం, ఫస్టియర్ విద్యార్థులు 50శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థిని జ్యోతుల సాయి జ్యోతి 470కి 461 మార్కులు సాధించి నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో అగ్రస్థానం నిలిపించింది. ఎంపీసీ సెకండియర్‌లో వెన్నా సాయి మణికంఠ 1000కి 953, సానా దేవి 952 మార్కులు సాధించారు. సీఈసీ ఫస్టియర్‌లో 500కి 451 మార్కులు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ రాజశేఖర్, పెద్దలు అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో 'పీఆర్' విద్యార్థిని ప్రతిభ



డి.సాయిలక్ష్మి

కాకినాడ రూరల్, ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో కాకినాడ పీఆర్ ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాల విద్యార్థిని డి.సాయిలక్ష్మి రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.తిరుపతి రెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఒకేషనల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ ఫలితాల్లో ఆమె 1000 మార్కులకుగాను 991 మార్కులు సాధించి పేదరికం ప్రతిభకు అడ్డురాదని నిరూపించిదన్నారు. ఈ సందర్భంగా సాయిలక్ష్మిని కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

హెలికాప్టర్‌లో మంగళగిరికి వెళ్లిన పవన్‌కల్యాణ్



గొల్లప్రోలు నుంచి మంగళగిరి హెలికాప్టర్‌లో వెళ్తున్న పవన్‌కల్యాణ్

గొల్లప్రోలు, ఏప్రిల్ 12: జనసేన అధినేత శుక్రవారం హెలికాప్టర్‌లో మంగళగిరి బయలుదేరివెళ్లారు. కోనసీమ పర్యటన ముగించుకుని పవన్‌కల్యాణ్ గురువారం అర్ధరాత్రి గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని నివాసానికి చేరుకున్నారు. రాత్రి అక్కడే బసచేసిన ఆయన శుక్రవారం ఉదయం 9గంటలకు పార్టీ నాయకులతో సమావేశమై నియోజకవర్గంలో ప్రచారం జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం అక్కడినుంచి బయలుదేరి గొల్లప్రోలు హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. ఉదయం 7.30గంటలకే మంగళగిరి బయలుదేరుతారని చెప్పినా హెలికాప్టర్ ఆలస్యంగా రావడంతో 9.29గంటలకు హెలికాప్టర్ ద్వారా వెళ్లారు. ఆయనకు పార్టీ నాయకులు వీడ్కోలు పలికారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 12: శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 16న భద్రాచలానికి కాకినాడ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ తెలిపారు. 16న ఉదయం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు భద్రాచలం బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. 17న మధ్యాహ్నంనుంచి తిరిగి కాకినాడకు బస్సులు బయలుదేరతాయన్నారు. ఈ బస్సులకు సాధారణ చార్జీ మాత్రమే వసూలు చేస్తామన్నారు. ప్రతిరోజూ కాకినాడనుంచి తిరిగే ఏడు షెడ్యూల్ బస్సులకు అదనంగా ఈ బస్సులు నడుపుతున్నామన్నారు. వీటికి రానుపోను రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్పీ సమీక్ష

కాకినాడ క్రైం, ఏప్రిల్ 12: రానున్న ఎన్నికలను పురస్కరించుకుని ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశమందిరంలో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీల ప్రతినిధులకు పోలీస్‌శాఖనుంచి కావాల్సిన వివిధ అనుమతులను సువిధ యాప్ ద్వారా పొందే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న కారణంగా జిల్లా పోలీస్ యంత్రాంగానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. జిల్లా పోలీస్ కార్యాలయం, కలెక్టరేట్ ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్‌కు ఎవరికి ఏ అవసరం వచ్చినా, రక్షణ కావాల్సి వచ్చినా, ఎన్నికల నియమ నిబంధనలను ఎవరు అతిక్రమించినా వెంటనే కంట్రోల్ రూములకు గానీ, లేదా సీ విజిల్ ద్వారా గానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉన్న కారణంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి లేకుండా ర్యాలీలు గానీ, సభలు గానీ నిర్వహించకూడదని ఆదేశించారు. కలెక్టర్ జారీ చేసిన 144 సెక్షను ఉత్తర్వులు, కంట్రోల్ నెంబర్లను ముద్రించిన పత్రాలను రాజకీయ పక్షాలకు అందజేశారు. ప్రతినిధులు వెలిబుచ్చిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు.

కలెక్టర్ మారినా ఫ్లెక్సీలో ఫొటో మారలేదే?

- ఫ్లెక్సీ బోర్డుల్లో దర్శనమిస్తున్న గత కలెక్టర్ ఫొటో
- కలెక్టరేట్ ఆవరణలోనే విచిత్రం
- జిల్లా కలెక్టర్ ఎవరనే అంశంపై చర్చ

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 12: కాకినాడ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటైన ఒక ఫ్లెక్సీ బోర్డు చర్చకు దారితీస్తోంది. దీనిపై బదిలీపై వెళ్లిన కలెక్టర్ ఫొటో ఉండడంతో జిల్లావాసులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ బదిలీ అయినా ఫొటోను ఎందుకు మార్చలేదని ప్రశ్నిస్తున్నారు. ఓటర్లను చైతన్యం పర్చేందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా యువతరం ఓట్లు ప్రగతికి మెట్లు అనే శీర్షికతో ఒక ఫ్లెక్సీని ప్రభుత్వం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసింది. ఈ బోర్డుపై ఎన్నికల కమిషనర్ ఫొటోతోపాటు అప్పటి జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా ఫొటోను ముద్రించారు. ఆమె ప్రసూతి సెలవు నేపథ్యంలో బదిలీపై వెళ్లి రెండువారాలైంది. అయినా ఇప్పటికీ గత కలెక్టర్ ఫొటోలను బోర్డులపై నుంచి తొలగించలేదు. కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జె.నివాస్ ఫొటోను దీనిపై ముద్రించడం అధికార యంత్రాంగం మరిచారు. దీంతో జిల్లావాసులు కొంత గందరగోళానికి గురవుతున్నారు. ఏదొక పనిపై కలెక్టరేట్‌కు వచ్చే జిల్లావాసులు దీనిపై చర్చించుకోవడం కనిపిస్తోంది. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డులపై కాకినాడ జిల్లా కొత్త కలెక్టర్ జె.నివాస్ ఫొటోలను అతికించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.



ఫ్లెక్సీ బోర్డులో కనిపిస్తున్న గత కలెక్టర్ ఫొటో

ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించాం

- జిల్లా కలెక్టర్ జె.నివాస్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 12: సార్వత్రిక ఎన్నికలు-2024 నిర్వహణలో భాగంగా ఈవీఎంల తొలి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించామని కలెక్టర్ జె.నివాస్ వెల్లడించారు. కాకినాడ కలెక్టరేట్ ఎన్ఐసీ సెంటర్‌లో జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. తొలి ఈవీఎంల ర్యాండమైజేషన్ నిర్వహించి ఆయా నియోజకవర్గాలకు ఈవీఎంలు, వీవీ ప్యాట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని, అభ్యర్థులు నామినేషన్ల దాఖలులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ప్రపోజర్స్, అఫిడవిట్లు, క్రిమినల్ కేసులు, వ్యయం ఖాతాలు వంటి విషయాలు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నామినేషన్లు దాఖలు చేయాలని సూచించారు. జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని రాజకీయ పార్టీలను కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, జిల్లా ఆడిట్ అధికారి వై.సురేష్, ఈవీఎంల నోడల్ అధికారి సునిల్‌కుమార్, ఎన్ఐసీ ఐటీ డైరెక్టర్ సుబ్బారావు, రాజకీయపార్టీల ప్రతినిధులు రంబాల వెంకటేశ్వరరావు, రావూరి వెంకటేశ్వరరావు, గదులసాయిబాబా, బండారు జయప్రకాష్, సుబ్బారావు, అప్పారావు పాల్గొన్నారు.

'ఓటింగ్ ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలి'

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ జరిగే రోజున తప్పులకు తావు లేకుండా ఓటింగ్ ప్రక్రియ జరగాలని పోలింగ్ సిబ్బంది పూర్తిఅవగాహనతో సన్నద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ నివాస్ అన్నారు. కాకినాడ పట్టణ నియోజకవర్గానికి సంబంధించి పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కాకినాడ రూరల్ నియోజకవర్గానికి ఐడియల్ కళాశాల, జగ్గంపేట నియోజకవర్గానికి మోడల్ డిగ్రీ కళాశాలలో పోలింగ్ సిబ్బందికి శిక్షణ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో కాకినాడ రిట్నరింగ్ అధికారి వెంకటరావు, కాకినాడ రూరల్ రిటర్నింగ్ అధికారి కిషోర్, జగ్గంపేట నియోజకవర్గం అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.నివాస్

ఎన్నికల వేళ రుణ బకాయిలు చెల్లించాలంటూ ఒత్తిళ్లు

- వైసీపీ అభ్యర్థిని కలవాలని హెచ్చరికలు
- పవన్‌ను ఓడించేందుకు సహకార అధికారుల పన్నాగం
- పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ సంచలన ఆరోపణలు

గొల్లప్రోలు, ఏప్రిల్ 12: ఎన్నికల సమయంలో రైతుల ఇళ్లకు వెళ్లి రుణాల బకాయిలు చెల్లించాలని ఒత్తిడి తేవడమే కాకుండా, వైసీపీకి మద్దతు ఇస్తే అప్పుల గురించి అడగమని డీసీసీబీ రికవరీ టాస్క్‌ఫోర్స్ అధికారులు రైతులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సంచలన ఆరోపణలు చేశారు. గొల్లప్రోలు పట్టణంలో ఎన్నికల నిమిత్తం ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలో ఈ టాస్క్‌ఫోర్స్ అధికారులు రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను ఓడించేందుకు సీఎం జగన్, సహకారశాఖలో ఉన్న రెడ్డి అధికారులు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. అధికారులు తప్పుడు పనులకు పాల్పడుతూ వైసీపీకి మద్దతు తెలపడం, ఆ పార్టీకి ఓటు వేయాలని చెప్పడం దారుణమన్నారు. కోట్లాది రూపాయిల బకాయిలు ఉన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరుల ఇళ్లకు వెళ్లకుండా టీడీపీ, జనసేనవారిని టార్గెట్ చేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. వైసీపీ అభ్యర్థి నెగ్గాలంటే యుద్ధం చేయాలి తప్ప రైతులను బెదిరించడం వంటి చర్యలకు పాల్పడడం మానుకోవాలని హితవు పలికారు. రైతులకు ఇటువంటి పరిస్థితి ఎదురైతే వెంటనే వీడియో లేదా ఫొటోలు తీసి తమకు పంపాలని కోరారు. డీసీసీబీ అధికారులు ఇటువంటి తప్పుడు విధానాలు మానుకోవాలని, లేకుండా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. పవన్ భారీమెజార్టీతో గెలుస్తున్నారని తెలిసి అధికార వైసీపీ ఇటువంటి తప్పుడు విధానాలకు పాల్పడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, నాయకులు శీరం మాణిక్యం, కడారి బాబ్జి, దువ్వా తాతాజీ, జనసేన నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, బస్వా ప్రసాద్, పర్ల రాజా, బీజేపీ నాయకులు చిట్టా మధు, కర్రి అన్నవరం, మలిరెడ్డి నారాయణరావు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండానే..



కాకినాడ రూరల్‌లోని అవంతినగర్‌లో నాన్ లే అవుట్ దృశ్యం

- నాన్ లే అవుట్‌తో ప్రభుత్వ ఆదాయానికి గండి
- చోద్యం చూస్తున్న అధికారులు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 12: వ్యవసాయ పొలాలను భూమార్పిడి చేయకున్నా చేసినట్లు చూపుతూ కొందరు రియల్టర్లు అనధికారికంగా లేఅవుట్లు వేసి అమ్మేస్తున్నారు. తద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో రియల్టర్లు ఇచ్చే కాసులకు కక్కుర్తిపడి చోద్యం చూస్తుండడంతో కాకినాడ రూరల్ మండలంలో నాన్ లే అవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

ప్లాట్లు విభజించి అమ్మకాలు

కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం శివారు అవంతినగర్ సర్వే నెంబర్ 16/1లో 2.66 ఎకరాల జిరాయితీ భూమి ఉంది. ఈ ప్రాంతంలో భూమి గజాల్లో రిజిస్ట్రేషన్ అవుతోంది. గజాల్లో భూమార్పిడి చేస్తే ప్రభుత్వానికి రూ.73లక్షల ఫీజు చెల్లించాల్సి వస్తోందని భావించిన ఓ రియల్టర్ గజాల్లో ఉన్న భూమిని కుంచాల్లో చూపించి కన్వర్షన్ చేయాలని ప్రజాప్రతినిధులతో రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. భూమార్పిడి కోసం గతంలో కాకినాడ రెవెన్యూ డివిజినల్ అధికారితో ఫైరవీలు సాగించారు. గజాల్లో ఉన్న స్థలాన్ని కుంచాల్లోకి మార్చి చూపితే ప్రభుత్వానికి భూ కన్వర్షన్ చేయించేందుకు ఫీజు రూ.23లక్షలు చెల్లించి మిగతా సొమ్ము అధికారులు, రాజకీయ నాయకులకు ముట్టచెప్పేలా ప్రయత్నాలు చేశారు. గజాల్లో ఉన్న భూమిని కుంచాల్లోకి మారిస్తే ఎవరైనా ఫిర్యాదు చేస్తే తమ ఉద్యోగానికి ముప్పు వస్తుందని భావించిన రెవెన్యూ అధికారులు అవంతినగర్ భూమి విషయంలో ముందుకెళ్లకుండా తాత్సారం చేస్తూ వచ్చారు. ఈ లోగా సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో సదరు రియల్టర్ ఎన్నికల కోడ్‌తో తనకు పనేంటి అన్న ధోరణితో ప్రభుత్వానికి భూమార్పిడి ఫీజు చెల్లించకుండా, సామాజిక స్థలం చూపకుండా నాన్‌లేఅవుట్ వేసి ప్లాట్లుగా విభజించి విక్రయాలు ప్రారంభించేశాడు. నాన్ లేఅవుట్‌పై స్థానికులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు ఉదాశీన వైఖరి ప్రదర్శించడంతో రియల్టర్‌కు నాన్ లేఅవుట్‌కాసుల పంట కురిపిస్తోంది. పంచాయతీ ప్లాన్ అప్రూవల్, భూబదలాయింపు లేకుండానే ప్లాట్లు కొనుగోలు చేసిన వారు సామర్లకోట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవడం విశేషం. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు రియల్టర్లు ఇచ్చే కాసులకు కక్కుర్తిపడి రియల్టర్లకు సహకరించడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతుందని స్థానికులు ఆరోపించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నాన్ లేఅవుట్ వేసి ప్లాట్లు విక్రయిస్తున్న రియల్టర్‌పై చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్, డీపీవోలను కోరుతున్నారు.


సీతారాములు, కల్యాణానికి పందిరిరాట వేస్తున్న పండితులు అధికారులు

సీతారాములు, సత్యదేవుడి
దివ్య కల్యాణాలకు పందిరిరాట

అన్నవరం, ఏప్రిల్ 12: రత్నగిరివాసుడైన సత్యదేవుడి దివ్యకల్యాణం, క్షేత్రపాలకుల సీతారాముల దివ్యకల్యాణోత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం పందిరరాట శాస్త్రోక్తంగా వేశారు. చైత్రమాసంలో ఈనెల 16నుంచి 22వరకు కల్యాణోత్సవాలు జరుగనుండగా రాములోరి కల్యాణం 17న ఉదయం నిర్వహిస్తారు. సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్ల వార్షిక దివ్యకల్యాణోత్సవాలు మే 18 నుంచి ప్రారంభమై 24 వరకు జరుగుతాయి. సత్యదేవుడి దివ్యకల్యాణం మే 19 రాత్రికి వైభవంగా జరుగనుంది. ఈఏడాది రెండు కల్యాణాలకు ఒకేసారి పందిరిరాట ముహూర్తం రావడం విశేషం. కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఈవో రామచంద్రమోహన్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు

సామర్లకోటలో భక్తులకు
ఉచిత వసతి సదుపాయాలు


ఉచిత వసతి సదుపాయాలు భక్తులకు కల్పించే కల్యాణ మండపం

సామర్లకోట, ఏప్రిల్ 12: కాకినాడజిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం సమీపాన 200 మీటర్ల దూరంలో మాండవ్యనారాయణ స్వామి ఆలయం వద్దగల కల్యాణ మండపంలో ఉచిత వసతి సదుపా యాలు భక్తులకు పూర్తి అందుబాటులో ఉంచినట్లు అలయ కార్యనిర్వహ ణాధికారి బళ్ళ నీలకంఠం తెలిపారు. ఈమేరకు శుక్రవారం విలేకరులతో ఈవో నీలకంఠం మాట్లాడుతూ ప్రతీరోజూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఈ సదుపాయాలు సుదూర ప్రాంతాల నుంచి భక్తుల అవసరార్థం ఏర్పాటుచేశామన్నారు. అలాగే భీమేశ్వరాలయం నూరుకాళ్ళ మండపంవద్ద దేవాలయ నిత్యాన్నదాన పథకంలో ఉచిత అన్నప్రసాద పథకం అమలులో ఉన్నందున భక్తులు ఈ అన్నప్రసాదాన్ని స్వీకరించాలని ఈవో నీలకంఠం తెలిపారు.

పవన్ విజయాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరు

పిఠాపురం/కొత్తపల్లి, ఏప్రిల్ 12: పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ గెలుపుని ఎన్ని కుతంత్రాలు చేసినా ఎవ్వరూ అడ్డుకోలేరని ఆ పార్టీ స్టార్ క్యాంపయినర్, సినీ నటుడు హైపర్ ఆది తెలిపారు. పిఠాపురం పట్టణంలోని 2,3వ వార్డుల్లో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులతో కలిసి ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి పవన్‌ను గెలిపించాలని అభ్యర్థించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవన్ లక్ష మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని చెప్పారు. పవన్‌కల్యాణ్ జనసేన పార్టీ పెట్టినప్పటి నుంచి సిద్ధాంతాలు నచ్చి ఆయనతో కలిసి అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఏ అధికారం లేకుండానే కౌలు రైతులు సహా ఎందరినో ఆదుకుంటున్నారని చెప్పారు. పవన్‌ను దత్తపుత్రుడు అంటూ కొందరు ఎగతాళి చేశారని, దత్తాత్రేయుడు ఆయన దత్తపుత్రుడిగా చేసుకుని పిఠాపురం నుంచి పోటీ చేయిస్తున్నారని తెలిపారు. అంతకు ముందు కోటగుమ్మం సెంటర్ వద్ద ఉన్న వైగణేష్ దేవస్థానం, అగ్రహారంలోని అనఘా దత్త క్షేత్రాల్లో పూజలు నిర్వహించారు. ప్రచారంలో జనసేన పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి వేములపాటి అజయ కుమార్, రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ తనయుడు గిరీష్‌వర్మ, వీరమహిళల విభాగం ఉభయగోదావరి జిల్లాల కోఆర్డినేటర్ చల్లా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● పిఠాపురంలో హైపర్ ఆది ప్రచారం

అలాగే హైపర్ ఆది కొత్తపల్లి మండలం వాకతిప్ప, కొత్తపల్లి, కొండెవరం గ్రామాల్లో స్థానిక నాయకులతో కలసి ప్రచారం నిర్వహించారు. జనసేన, టీడీపీ నాయకులు గవర రాంబాబు, మత్సా అప్పాజీ, గుండ్ర జగ్గారావు, గుండా అప్పారావు, పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.


పిఠాపురంలోని అనఘాదత్త క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న సినీ నటుడు హైపర్ ఆది

వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలను
విజయవంతంగా నిర్వహించాలి

రెండో దఫా సమీక్షలో కొత్తపేట ఆర్డీవో సత్యనారాయణ

ఆత్రేయపురం, ఏప్రిల్ 12: కోనసీమ తిరుమల వాడపల్లిలో ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు జరిగే శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులతో రెండో దఫా సమీక్షించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. 19న తీర్థం, రథోత్సవం, కల్యాణోత్సవాలకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్టీసీ, హెడ్‌వర్క్స్, హెల్త్, అగ్నిమాపక శాఖల అధికారులు ఉత్సవాలకు తీసుకున్న చర్యలను వివరించారు. వివిధ డిపోల నుంచి 20బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ముగ్గురు సీఐలు, ఐదుగురు ఎస్‌ఐలు, 60 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు సీఐ రామ్‌కుమార్ తెలిపారు. ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్, డీఎల్డీవో రాజేశ్వరరావు, దేవదాయశాఖాధికారి మల్లేశ్వరరావు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, తహసీల్దారు వెంకట్రామయ్య పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాస ప్రాంగణంలోని కల్యాణ వేదికను ఇన్‌చార్జి ఆర్డీసీ టి.విజయరాజు, ఆర్డీవో సత్యనారాయణ, అధికారులతో కలిసి ఆర్డీవో పరిశీలించి ఏర్పాట్ల వివరాలు తెలుసుకున్నారు.


కల్యాణోత్సవాలపై సమీక్షిస్తున్న ఆర్డీవో సత్యనారాయణ

18న రావులపాలెంలో 'సిద్ధం' సభ

● సీఎం జగన్ హాజరు

రావులపాలెం, ఏప్రిల్ 12: రావులపాలెంలో ఈనెల 18న 'సిద్ధం' సభ నిర్వహించనున్నట్టు వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, ఎంపీ సుభాష్ చంద్రబోస్, మంత్రి విశ్వరూప్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. అనంతరం 'సిద్ధం' సభ పోస్టర్లను విడుదల చేశారు. 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు రావులపాలెంలో జరిగే సభకు సీఎం జగన్ హాజరవుతారన్నారు. రాత్రి కాకినాడ చేరుకుంటారన్నారు. ఎమ్మెల్యే పొన్నాడ సతీష్, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, ఎంపీ చింతా అనురాధ, పలువురు నాయకులు పాల్గొన్నారు.


'సిద్ధం' సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇంటర్ ఫలితాలలో 'తిరుమల' ప్రతిభ


అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 12: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులోని తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్టు విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470కి 466 మార్కులు 12 మంది విద్యార్థులు జె.శ్రీసాయి బృంద, బి.ఉమాశ్రీ, కె.హేమంత్, కె.ప్రజ్ఞ, సీహెచ్.పూజిత సాయి, ఎస్.కావ్యశ్రీ, జె.పద్మప్రియ, ఎం.దీపికా రాజకుమారి, ఎం.ఆయేషా సిద్ధిక్, ఎ.పద్మిని, కె.సాయి సృజన, బి.యశ్వంత్ లోవస్వామి సాధించారని, 464 పైన 191మంది, 460 పైన 732మంది, 450 పైన 1688 మంది సాధించి 98.85 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. బైపీసీ విభాగంలో 440కి 436 మార్కులు నలుగురు విద్యార్థులు ఎల్.ప్రవల్లిక, ఆర్.సుచి, పి.సాయి అవినాష్, ఎ.దివ్యమానస సాధించారని, 433 పైన 62 మంది, 430పైన 120 మంది, 400 పైన 348 సాధించి 99.06 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకుగాను కె.బేబీ జాగ్రతి 990 మార్కులు, ఎం.దేవీవైష్ణవి 990 మార్కులు, 15 మంది విద్యార్థులు 989 మార్కులు, 11 మంది 985 మార్కులు పైన, 384 మంది 980 మార్కులు పైన, 1465 మంది 950 మార్కులు పైన సాధించి 99.88 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బైపీసీ విభాగంలో 1000 మార్కులకుగాను ఎస్.రాధాకృష్ణ 989, ఎం.టెస్సా ఫ్రాన్సిస్ 989, డి.నవీన్ తేజా 989, పి.జ్ఞానశ్రీ 989 మార్కులు సాధించారని తెలిపారు. 58మంది విద్యార్థులు 980 పైన, 125 మంది 970 పైన, 227 మంది 850 పైన మార్కులు సాధించి 99.30శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. విద్యార్థులను శుక్రవారం పుష్పగుచ్ఛాలతో తిరుమలరావు అభినందించారు. అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో 'ఆదిత్య' జయకేతనం

కాకినాడ రూరల్, ఏప్రిల్ 12: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో యోగిత, సవిత, అంజలి, సుజీత, ఆశిష్‌సాయి, బిందుమాధురి, అనిరుద్ 470 మార్కులకుగానూ ఏడుగురు విద్యార్థులు 465 మార్కులు సాధించి రాష్ట్రంలో అత్యుత్తమ స్థానాన్ని దక్కించుకున్నారన్నారు. అదేవిధంగా 20 మంది విద్యార్థులు 464 మంది సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో గీత సౌమ్య 1000 మార్కులకుగానూ 990, సైద్ షెహనాజ్ 989, ఐదుగురు విద్యార్థులు 988, ఎనిమిది మంది విద్యార్థులు 987 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో 440 మార్కులకుగానూ వెంకట లలిత 435, ఒకరు 434, ముగ్గురు 433, మరో ముగ్గురు 432 మార్కులను పొందినట్లు తెలిపారు. ఎంఈసీ జూనియర్ ఇంటర్లో ఫలితాల్లో మహేశ్వరి, అంజనాదేవి, సంతోషి 500 మార్కులకుగానూ 489, సీనియర్ ఇంటర్ ఫలితాల్లో శేఖర్ సాత్విక 1000 మార్కులకుగానూ 978, సరయు 972 ఇద్దరు విద్యార్థులు 971 మార్కులు సాధించారన్నారు. ఈసందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి కృష్ణదీపక్‌రెడ్డి, వైస్‌చైర్మన్ సతీష్‌రెడ్డి, జూనియర్ కళాశాలల సమన్వయకర్త లక్ష్మీకుమార్ తదితరులు అభినందించారు.

175 నియోజకవర్గాల్లోనూ బీఎస్పీ పోటీ

● బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 12: రాష్ట్రంలో బహుజనుల సమస్యలు రాజ్యాధికారం ద్వారానే పరిష్కారమవుతాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా. పరంజ్యోతి అన్నారు. రాజమహేంద్రవరం గేదెల నూకరాజు కల్యాణ మండపంలో శుక్రవారం ఉమ్మడి జిల్లాలో పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో సమీక్షించారు. ఒక బీసీగాని, ఎస్సీ గాని ముఖ్యమంత్రి కావాలంటే అది బీఎస్పీ వల్లే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో బీఎస్పీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని చెప్పారు. తొలుత పూలే, కాన్షీరాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ పూర్ణచంద్రరావు, రాజమహేంద్రవరం, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థులు పి.గణేశ్వరరావు, కే.నరసింహమూర్తి, నిడదవోలు,పి.గన్నవరం, అమలాపురం, రాజమహేంద్ర వరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థులు గుమ్మాపు చిత్రసేను, కె.సత్యం, యాళ్ళ దొరబాబు, కొండపల్లి సూరిబాబు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్రహ్మణ్యం, కోనసీమ జిల్లా అధ్యక్షుడు ఎం మోషే తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి

రుణాలు ఇప్పిస్తామని మోసం

● లక్షల్లో సొమ్ములు కోల్పోయామని బాధితుల ఫిర్యాదు

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 12: రుణాల పేరుతో మోసగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు బాధితులు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై శుక్రవారం కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన చిన్నం మణి, అన్నవరం, మంగం వసంత, లోడా పద్మ, బందిలి భవానీ, నాగలక్ష్మి, కుంచే సత్యవతి తదితరుల వద్దకు కాకినాడకు చెందిన పెదపాటి చిన్ని, జగ్గంపేటకు చెందిన పద్మలతో పాటు చేబ్రోలుకు చెందిన అన్నవరం అనే వ్యక్తి ద్వారా వచ్చి తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తామని, రుణమాఫీ చేయిస్తామని నమ్మబలికారు. వీరి ఆధార్, రేషన్‌కార్డుల జిరాక్స్‌లు, ఫోటోలు తీసుకుని బ్యాంకు పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. రుణాలు మంజూరయ్యాయని చెప్పి రూ.50వేలు వంతున ఇచ్చారు. రుణ వాయిదాలను చిన్నికి చెలిస్తూ వచ్చారు. కొంతకాలం తర్వాత పిఠాపురం బ్యాంకు ఆఫ్ బరోడా సిబ్బంది వచ్చి మీరు రూ.2లక్షల వంతున రుణం తీసుకున్నారని, వాయిదాలు చెల్లించలేదని చెప్పారు. తక్షణం రుణాలు చెల్లించాలని సూచించారు. దీంతో తాము మోసపోయినట్లు తెలుసుకుని చిన్ని ప్రశ్నించగా తమను బెదిరించిందని బాధితులు తెలిపారు. తమను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు జిల్లా ఎస్పీని ఆశ్రయించారు. విచారణ అనంతరం పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు.

లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు

పిఠాపురం, ఏప్రిల్ 12: నిర్లక్ష్యంగా వాహనం నడిపి ముగ్గురు మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష, ఆరు వేల రూపాయలు జరిమానా విధిస్తూ పిఠాపురం ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.సుధారాణి తీర్పు చెప్పారు. పెదపూడికి చెందిన భక్తులు తలుపులమ్మలోవకు వెళ్లేందుకు ట్రాక్టర్‌పై బయలుదేరి పిఠాపురం పట్టణంలోని బైపాస్‌రోడ్డులో గోపాల్‌బాబా ఆశ్రమం సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో బాలుడు సహా ముగ్గురు మరణించారు. దీనిపై అప్పటి సీఐ రాంబాబు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ తిమ్మాపురం గ్రామానికి చెందిన సలాది సత్తిబాబుకు వివిధ సెక్షన్ల కింద జైలు శిక్ష, జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ఏపీపీ ఆకుల నాగలీలా రోజా ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

పెద్దిపాలెంలో తాటాకిల్లు దగ్ధం

● రూ.20లక్షలు ఆస్తినష్టం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 12: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో 3 పోర్షన్‌ల తాటాకిళ్లు దగ్ధమై రూ.20లక్షల ఆస్తినష్టం కలిగింది. దీంతో మూడు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. పెద్దిపాలెంకు చెందిన పక్కుర్తి అచ్చిరాజు, లోవరాజు, పక్కుర్తి మాణిక్యం కుటుంబాలకు చెందిన మూడుపోర్షన్‌ల తాటాకిళ్లు శుక్రవారం తెల్లవారుజామున 2గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి.

ఈ ప్రమాదంలో తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బీరువాలో ఉన్న రూ.3లక్షల నగదు, 30బస్తాల ధాన్యం, 10కాసుల బంగారం కాలి బూడిదయ్యాయి. విలువైన ఫర్నీచర్ మంటలకు ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో 3 కుటుంబాల వారు సర్వం కోల్పోయి వీధిన పడ్డారు. ప్రమాద విషయం తెలిసి ప్రత్తిపాడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరుని అడిగి తెలుసుకుని బాధితులను ఓదార్చి బియ్యం, నగదు అందజేశారు. పెద్దిపాలెంకు చెందిన కొందరు రూ.11వేలు బాధిత కుటుంబానికి సహాయం అందజేశారు.


పెద్దిపాలెంలో దగ్ధం అవుతున్న తాటాకిళ్లు


బీరువాలో కాలిపోయిన సామాన్లను పరిశీలిస్తున్న సత్యప్రభ

సామర్లకోటలో వాహన తనిఖీల్లో
రూ.12.67 లక్షలు స్వాధీనం


సామర్లకోటలో వాహనాల తనిఖీలో పట్టుబడ్డ డబ్బు

సామర్లకోట, ఏప్రిల్ 12: ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు సామర్లకోట పట్టణంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శుక్రవారం స్థానిక మఠం సెంటర్ వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఎటువంటి ధ్రువ పత్రాలు, రసీదులు లేకపోవడంతో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.12 లక్షల 67వేల 611లను స్వాధీనం చేసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి జాస్తి రామారావు తదితర పోలీసు అధికారులతో కలసి ఈ తనిఖీలు నిర్వహించా రు. పెద బ్రహ్మదేవం గ్రామానికి చెందిన సీహెచ్‌వీవీ సత్యనారాయణమూర్తి వద్ద రూ.5.39లక్షలు, అచ్చంపేటకు చెందిన ఎల్లా రాకేష్ వద్ద రూ.7లక్షల, 28 వేల 611లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తాలను సీజ్ చేసి ట్రెజరీకి అప్పగించినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రామారావు చెప్పారు.

'శ్రీ ప్రకాష్' విద్యార్థుల విజయభేరి


టి.వినీలా


డీడీ సాయి శ్రీనివాస్


లాస్యనందిని


సాయి నిహారికి


ఎస్ఐ మేఘన


జి.వర్షిణి

తునిరూరల్, ఏప్రిల్ 12: ఏపీ ఇంటర్ బోర్డు ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం నుంచి టి.వినీల 1000కి 982, డీడీ సాయి శ్రీనివాస్ 1000కి 980 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా బైపీసీ ద్వితీయ సంవత్సరం లో కె.లాస్యానందిని 1000కి 979 మార్కులతో అగ్రస్థానం, ఎంపీసీ ప్రథమం, డీవీఎల్ సాయి నిహారికి 470కి 464, ఎస్. మేఘన 470కి 463 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. బైపీసీ ప్రథమ సంవత్సరంలో జి.వర్షిణి 440కి 428మార్కులతో అగ్రస్థా నంలో నిలిచి ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో తమ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

లాడ్జిలో ఉరి వేసుకుని యువకుడి మృతి


మృతి చెందిన అనిల్‌కుమార్

రామచంద్రపురం(ద్రాక్షారామం), ఏప్రిల్ 12: రామచంద్రపురంలో సాయి దత్తా లాడ్జిలో పెమ్మనబోయిన అనిల్ కుమార్(25) ఉరి వేసుకుని మృతి చెందాడు. వేళంగి గ్రామానికి చెందిన అనిల్ గురువారం సాయంత్రం స్థానిక సాయిదత్తా లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. రూమ్‌లో అనిల్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లాడ్జి మేనేజరు మేకా శివప్రసాద్ బంధువులకు సమాచారం ఇచ్చారు. అనిల్ అన్న వీరబాబు ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్ఐ కె.సురేష్‌బాబు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అనిల్‌కు తండ్రి లేదు, తల్లి వద్ద ఉంటున్నాడు. క్రికెట్ బెట్టింగ్స్‌కు బానిసై ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు.

లారీని ఢీకొని యువకుడి మృతి

● మరొకరికి గాయాలు



పెరవలి, ఏప్రిల్ 12: నిడదవోలు-నరసాపురం రోడ్డులో కానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో అన్నవరప్పాడుకు చెందిన వసంతాడ మధు (20), నిడదవోలు మండలం కలవచర్లలో దగ్గరి బంధువైన ముప్పిడి నాగచరణ్‌తో కలిసి అన్నవరప్పాడు వస్తుండగా మార్గమధ్యలో కానూరు వద్ద లారీని ఢీకొట్టారు. దీంతో మధు అక్కడికక్కడే మృతి చెందగా నాగచరణ్‌కు గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం

కాజులూరు, ఏప్రిల్ 12: విద్యుదాఘాతంతో యువకుడు దుర్మరణం చెందాడు. స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఉప్పుమిల్లి గ్రామానికి చెందిన యాళ్ళ మధుసునీల్ (19) స్థానిక గ్రామానికి చెందిన ఆక్వా రైతు మారెళ్ళ ఆదినారాయణ చెరువువద్ద జీతానికి పనిచేస్తున్నాడు. అయితే మధుసునీల్ చెరువులో చెత్త కోస్తుండగా ప్రమాదవశాత్తూ కొడవలికి కరెంటు వైరు తగిలి తెగిపోయింది. ఈ క్రమంలో కరెంటు వైరు తగిలి ప్రమాదం సంభవించి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లపాలెం ఎస్ఐ తులసీరామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీడనై నీవెంటే..

● ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల జోరు ● ఎన్నికల అధికారులపై కూడా నిఘా

● ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల వాహనాలకు సీసీ కెమెరాలు

● కలెక్టర్, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలకు అనుసంధానం

సామర్లకోట, ఏప్రిల్ 12: వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వారి ప్రచారాలు, డబ్బు, మద్యం సరఫరాపై ఎన్నికల అధికారులు నిఘా పెట్టారు. ఎన్నికల అధికారులపై సైతం నిఘా ఉంటోంది. ముఖ్యంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల తీరును 24 గంటలపాటు డేగ కన్నుతో పర్యవేక్షిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారుల్లో, చెక్‌పోస్టులవద్ద తనిఖీల్లో ఎన్నికల అధికారులు సైతం ఎలాంటి పొరపొచ్చాలకు పోకుండా ఉండాలనే ఆలోచనతో వారి వాహనాలకు సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. దీంతోపాటు వాటిని ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి తమ మొబైల్ ఫోన్‌లలో చూసుకునేలా జీపీఎస్ ట్యాగ్‌చేసి సీసీ కెమెరాల లైవ్‌ను అందిస్తున్నారు. దీంతో ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువులు, డబ్బులు, మద్యం ఇతరత్రా పరిణామాలు ఏం జరిగినా ఉన్నతాధికారులు నీడనై వారి వెంటే ఉంటున్నారు. ఎన్నికల అధికారులను ప్రలోభపెట్టినా, ఎలక్షన్ కమీషన్ తీసుకున్న ఈ చర్యతో ఎవరు తప్పించుకునే అవకాశం లేకుండాపోయింది.

పనితీరు ఇలా..

పెద్దాపురం నియోజకవర్గంలో మొత్తం 9 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు షిఫ్టులుగా పనిచేస్తున్నారు. సామర్లకోట మండలం, పట్టణంలలో రెండు బృందాలు, పెద్దాపురం మండలం, పట్టణంలలో రెండు బృందాలను ఏర్పాటుచేశారు. ఈ బృందాలు 24 గంటలూ పనిచేస్తాయి. ఒక్కొక్క బృందం 8 గంటల పాటు షిఫ్టుగా పనిచేస్తాయి. వీరు తిరిగే వాహనంపై ప్రత్యేకంగా సీసీ కెమెరాను ఏర్పాటుచేశారు. సి-విజిల్ యాప్ ద్వారా ఎన్నికల అధికారులకు వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి నిమిషాల వ్యవధిలో ఆ బృందం అక్కడికి వెళ్లి పరిశీలించే ప్రతీదీ సీసీ కెమెరాల్లో రికార్డుఅవుతుంది. దీనికి తోడుగా అసెంబ్లీ ఎన్నికలలో అభ్యర్థుల ప్రచారతీరును సైతం ఎన్నికల కమీషన్ డేగకన్నుతో గమనిస్తోంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, జన సమీకరణ, గొడవలు, అక్రమ రవాణా తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు అధునాతన పీటీజెడ్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇవి 360 డిగ్రీల కోణంలో తిరుగుతూ సుమారు 50 మీటర్ల దూరం వరకూ సన్నివేశాలను, ఆయా పార్టీల ప్రచారాలను రికార్డు చేస్తాయి.


వాహనాలు తనిఖీలు చేసే ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల బృందం

కలెక్టర్, రిటర్నింగ్ కార్యాలయాలకు అనుసంధానం

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్‌గా ఎంపీడీవో, మున్సిపల్ కమీషనర్ స్థాయిలో పనిచేస్తున్న అధికారులను నియమించారు. ఈ బృందాలు షిఫ్టుల ప్రకారం పనిచేస్తున్నాయి. ఈనెల ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వారి వాహనాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎక్కడా చిన్నతప్పు జరగకుండా ఎన్నికల కమీషన్ పకడ్బందీగా ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారెవరైనా తప్పించుకోలేరు. ఈ కెమెరాలు కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలకు అనుసంధానం చేసి ఉంటాయి.

బాలాత్రిపురసుందరికి విశేష పూజలు

సామర్లకోట, ఏప్రిల్ 12: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో వసంత నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా బాలాత్రిపురసుందరి అమ్మవారికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబుల తో అమ్మవారికి విశేష కుంకుమార్చన, విశేష పుష్పార్చన పూజలు చేసి సుందరంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

జనసేన ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ నియామకం

పిఠాపురం, ఏప్రిల్ 12: పిఠాపురం నియోజకవర్గంలో జనసేన తరపున ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటైన వివిధ కమిటీలకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శుక్రవారం ఆమోదం తెలిపారు. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలు వారు ఇందులో భాగస్వాములయ్యేలా కమిటీలను రూపొందించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు ఆధ్వర్యంలో విస్తృతంగా నిర్వహించిన సమావేశాలు అనంతరం ఏకాభిప్రాయంతో ఈ కమిటీలను రూపొందించారు. కమిటీల్లో నియమితులైన వారికి పవన్ అభినందనలు తెలిపారు. నియోజకవర్గ ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీలో నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్‌తో పాటు తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, మురాలశెట్టి సునీల్, కడారి తమ్మయ్యనాయుడు, మత్సా అప్పాజీ, చల్లా లక్ష్మీ, వెన్నా జగదీష్, జ్యోతుల శ్రీనివాస్, పిల్లా శివశంకర్, వెన్నా జగదీష్, వాకపల్లి సూర్యప్రకాష్, బీఎస్ రాజు, జోగా వెంకట రమణ, ఊటా ఆదివిష్ణు, పల్లేటి బాపన్నదొర, కంబాల దాసు, కాకి గంగాధర్, సూరవరపు సురేష్, కురుమళ్ల రాంబాబు, తోలేటి శిరీష, జ్యోతుల సతీష్, దానం లాజర్‌బాబు, మర్రి దొరబాబు, దేవరపల్లి వెంకట శ్రీనివాస్, మారిశెట్టి వరలక్ష్మి సత్తిబాబు, సానా నాగు, ఓదూరి నాగేశ్వరరావు, పిల్లా రమ్యజ్యోతి, వినుకొండ అమ్మాజీ, కోలా దుర్గ, మేడిశెట్టి నాగమణిలు సభ్యులుగా నియమితులయ్యారు. లీగల్ టీమ్ సభ్యులుగా పడాల రవి, ఉదయభాస్కర్, కోఆర్డినేటర్ అసోసియేషన్ టీమ్ సభ్యులుగా డాక్టర్ పిల్లా శ్రీధర్, మాదేపల్లి శ్రీనివాసరావు, బవిరిశెట్టి రాంబాబు, రెడ్డెం రమేష్, జవ్వాది జోగేశ్వరరావు, మార్నీడి రంగబాబు, అడపా సూరిబాబు, పంచకర్ల సందీప్, శశిదర్ యాదవ్, తుమ్మల చందు, పెన్నంరెడ్డి నాగబాబులు, ప్రజంటేషన్ ఫ్రమ్ డిస్ట్రిక్ట్ టీమ్ సభ్యులుగా తుమ్మల రామస్వామి, తుమ్మలపల్లి రమేష్, వరుపుల తమ్మయ్యబాబు, చిక్కాల సుబ్రహ్మణ్యేశ్వరరావులు నియమితులయ్యారు. పిఠాపురం పట్టణం, మండలం, గొల్లప్రోలు పట్టణం, మండలం, కొత్తపల్లి మండలాలకు సంబంధించి ఎలక్షనీరింగ్ టీమ్ సభ్యులుగా 153మందిని సభ్యులుగా నియమించారు.

'బ్రాహ్మణులను మోసం చేసిన జగన్'

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 12: టీడీపీ ప్రభుత్వ హయాంలో బ్రాహ్మణుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన 13 సంక్షేమ పథకాలను సీఎం జగన్ రద్దు చేసి బ్రాహ్మణులను మోసం చేశారని కాకినాడ రూరల్ జనసేన కూటమి అభ్యర్థి పంతం నానాజీ విమర్శించారు. శుక్రవారం వలసపాకల గంగరాజునగర్ జనసేన పార్టీ కార్యాలయంలో సర్పవరంకు చెందిన సీనియర్ వైసీపీ నేత, ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ దినవహి వీర్రాజు (పేరుబాబు), డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మానేపల్లి బాబ్జితో పాటూ అనుచరులతో కలసి జనసేనలో చేరగా వారికి నానాజీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), ఎలిశెట్టి ప్రసాద్, అడ్డాల సూర్యనారాయణ, రేపాక సర్వేశ్వరరావు, దివవమ వెంకట్రాజు, సంతోష్, దుర్గాప్రసాద్‌శర్మ, పుల్ల శ్రీరాములు, చైర్మన్ శ్రీను, నారాయణరావు ఉన్నారు.

'వైసీపీకి రాజకీయ సమాధి కట్టాలి'

కరప, ఏప్రిల్ 12: అడుగడుగునా ప్రజావంచన చేసిన అధికార వైసీపీకి రానున్న ఎన్నికల్లో ప్రజలు రాజకీయ సమాధి కట్టాలని కాకినాడరూరల్ టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు పిలుపునిచ్చారు. కరప మండలం వలసపాకల గ్రామంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, జనసేన నేత పంతం సందీప్‌లతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ సూపర్ సిక్స్ మ్యానిఫెస్టోను వివరించి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లకు మద్దతుగా గాజు గ్లాసు గుర్తుపై ఓటేయాలని అభ్యర్థించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు చంద్రు వెంకన్నరాయచౌదరి, బోగిరెడ్డి గంగాధర్, బోగిరెడ్డి కొండలరావు, బండారు మురళి, వాసంశెట్టి వెంకటరమణ, ఆంజనేయులు, పలివెల జానకిరామయ్య, మద్దూరి స్వామి, దూడల నారాయుడు పాల్గొన్నారు.

'జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 12: నిరుద్యోగ, ఉద్యోగ, ఉపాధ్యాయ అన్ని వర్గాలను మోసం చేసిన జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో గద్దె దించాలని ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి చెన్నకేశవులు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా కాకినాడ నగరానికి విచ్చేసిన ఆయన శుక్రవారం ఓ ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కాకినాడ జిల్లా ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చెన్నకేశవులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపి యునైటెడ్ ఫ్రంట్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ పగిడిపల్లి రాజారావు, రాష్ట్ర నాయకులు ఎల్.రామలింగం, ఎన్.జోలారావు పాల్గొన్నారు.

'రైతులు అభివృద్ధి చెందాలి'

ప్రత్తిపాడు, ఏప్రిల్ 12: వ్యవసాయ అనుబంధ పరిశ్రమలతో రైతులు అభివృద్ధి చెందాలని జగ్గంపేట వ్యవసాయశాఖ ఏడీఏ గంగాధర్ చెప్పారు. మండలంలోని రాచపల్లి గ్రామంలో శుక్రవారం వ్యవసాయ ఉత్పత్తిదారుల రైతుసంఘ సర్వసభ్య సమావేశంలో ఏడీఏ ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ సమష్టిగా ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యులుగా చేరి నాబార్డు, ఎస్ఎఫ్ఎస్‌టీ, కేబీబీసీ తదితర సంస్థల ద్వారా రుణాలు పొంది వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన పరిశ్రమలు స్థాపించి అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు, శ్రేస్ట్ ఎఫ్‌టీయూ డైరెక్టర్లు పాల్గొన్నారు.

18 నుంచి మాండవ్యనారాయణ స్వామి ఉత్సవాలు

సామర్లకోట, ఏప్రిల్ 12: సామర్లకోట పట్టణ శివారు గోదావరి కాలువ ఒడ్డున ఉన్న పురాతన ప్రసిద్ధి పొందిన మాండవ్య నారాయణస్వామి దివ్యకల్యాణోత్సవాలు ఈ నెల 18నుంచి జరుగనున్నట్టు జిల్లా దేవదాయాధికారి పులి నారాయణమూర్తి తెలిపారు. ఆలయ ఆవరణలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ 19న స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంపై అలంకరించి పురవీధుల మీదుగా గ్రామోత్సవం నిర్వహించి అదే రోజు రాత్రికి ఆలయ ఆవరణలో ప్రత్యేక వేదికపై దివ్యకల్యాణోత్సవం భక్తజనం సమక్షంలో వైభవంగా జరుపనున్నట్టు స్పష్టం చేశారు.

'భయపెట్టేందుకే వలంటీర్ల రాజీనామా'

రౌతులపూడి, ఏప్రిల్ 12: ఓటర్ల భయపెట్టేందుకే వలంటీర్లు రాజీనామా నాటకాలు ఆడుతున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ వలంటీర్ల రాజీనామాలపై శుక్రవారం ఒక ప్రకటనలో స్పందించారు. వలంటీర్లను ఈ 2 నెలలు ఎన్నికల సంఘం దూరంగా ఉంచిందన్నారు. కావాలనే చంద్రబాబుపై బురద జల్లేందుకు వైసీపీ నేతలే వలంటీర్లతో రాజీనామాలు చేయిస్తున్నారన్నారు. ప్రజలకు బెదిరించాలంటే రాజీనామాలు చేస్తేనే కుదురుతుందనే రాజీనామాలు చేస్తున్నారని ఆరోపించారు.

విలేఖరిపై దాడి సంఘటనపై కేసు

పిఠాపురం, ఏప్రిల్ 12: విలేఖరిపై ఆటోడ్రైవర్లు దాడి చేసిన సంఘటనపై పిఠాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఒక దినపత్రికలో విలేఖరిగా పనిచేస్తున్నాడు. ఆటో ఉండగా డ్రైవర్‌ను పెట్టుకుని నడిపిస్తున్నాడు. అతడి ఇంట్లో నివాసముంటున్న వారు శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానానికి వెళ్లారు. దీంతో తమ ఆటోలపై వెళ్లాలని అక్కడ ఆటోడ్రైవర్లు వాగ్వాదానికి దిగారు. పెద్దలు కలగచేసుకోగా వివాదం సమసిపోయింది. శుక్రవారం మధ్యాహ్నం విలేఖరి తన ద్విచక్ర వాహనంపై మహాసంస్థానం వద్ద ఉండగా ఆటోడ్రైవర్లు డి.గంగబాబు, కె.అప్పారావు దాడికి పాల్పడి గాయపరిచారు. విలేఖరి ఫిర్యాదుతో పోలీసలు కేసు నమోదు చేశారు.

15న జ్యోతుల సీతారామమూర్తి సంస్మరణ సభ

పోర్టుసిటీ (కాకినాడ), ఏప్రిల్ 12: మెయిన్‌రోడ్‌లోని టౌన్‌హాల్ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు మున్సిపల్ మాజీ చైర్మన్ జ్యోతుల సీతారామమూర్తి సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు తెలిపారు. నగర ప్రముఖులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు జ్యోతుల పట్ల గౌరవభావంతో నివాళులర్పించాలని ఓ ప్రకటనలో కోరారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

ఏలేశ్వరం, ఏప్రిల్ 12: అంబేడ్కర్ 133వ జయంతి వేడుకల్లో భాగంగా టీడీపీ నాయకులు ఏలేశ్వరం పట్టణంలోని కంబాలపాలెం కాలనీలో జైభీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్‌ను కౌన్సిలరు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోనాల వెంకటరమణ, ఎండగుండి నాగబాబు, బుగతా శ్రీను, బాబ్జి, సామంతుల గోపి, కప్పల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నిప్పుల కొలిమిగా ప్రత్తిపాడు!

ప్రత్తిపాడు, ఏప్రిల్ 12: ప్రత్తిపాడు మండలం శుక్రవారం వాతావరణం నిప్పుల కొలిమిగా మారింది. భానుడు భగభగ మండి చండ ప్రచండంగా వడగాల్పులు వీయడంతో మండల ప్రజలు ఎండ తీవ్రతకు అల్లాడిపోయారు. తీవ్రస్థాయిలో వీచిన వడగాల్పులకు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు అమాంతం తగ్గిపోయాయి. ఉష్ణతాపం తాళలేక వాహనాల డ్రైవర్లు హైవే వెంబడి చెట్ల వద్ద నిలిపి సేదతీరారు.


ఎండ తీవ్రతకు నిర్మానుషంగా ధర్మవరం జాతీయ రహదారి

అవినీతి పాలన అంతానికి ఏకం కావాలి

» పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప » పలుచోట్ల కూటమి అభ్యర్థుల ప్రచారం » వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు




సామర్లకోట: ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాజప్ప, కాకినాడ సిటీ: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కొండబాబు, ప్రత్తిపాడులో మాట్లాడుతున్న సత్యప్రభ

సామర్లకోట, ఏప్రిల్ 12: వైసీపీ నిరంకుశ, అవినీతి పాలన అంతం కోసం ప్రజలందరూ ఏకం కావాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం సామర్లకోట మండలం జీ.మేడపాడు గ్రామంలో కాకినాడ పార్లమెంటరీ తెలుగురైతు కమిటీ చైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు, నిమ్మకాయల రంగనాగ్, తోటకూర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటా టీడీపీ ప్రచారం నిర్వహించారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పార్టీల నాయకులు తుమ్మల బాబు, విత్తనాల వెంకటరమణ, గుమ్మళ్ళ రామకృష్ణ, కుర్రా నారాయణస్వామి తదితరులతో కలిసి ప్రచారంలో రాజప్ప ఇంటింటా పర్యటించి మాట్లాడారు. రాష్ట్ర ప్రగతి, అభ్యున్నతి, భావితరాల భవిష్యత్తు కోసం 3 పార్టీలు కలిసికట్టుగా సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజల సేవల కోసం పోటీపడాల్సిన అధికార పార్టీ నేతలు డబ్బు సంపాదన కోసం, ఆధిపత్యం కోసం పోటీపడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రం, దేశంలోనూ ఎన్డీఏ కూటమి ఆవశ్యకత ఉందని ఆయన చెప్పారు. ప్రచారంలో దారి పొడవునా మహిళలు మంగళహారతులతో కూటమి నాయకులకు నీరాజనాలిచ్చారు.

'ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతాం'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 12: వైసీపీ మోసపూరిత పాలనలో కుంటుపడిన కాకినాడను రాబోయే కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 12వ డివిజన్ పర్లోవపేటలో శుక్రవారం బహిరంగ సభ నిర్వహించారు. వైసీపీ నుంచి దిబ్బాడ పెదబాబు, చింతపల్లి లక్ష్మి, చింతపల్లి అప్పారావు, నొల్లి సింహాచలం, దిబ్బాడ పోలరాజు వారి అనుచరులు 200కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, మాజీ మేయర్ సుంకర పావని తిరుమలకుమార్ పాల్గొన్నారు. వైసీపీ నుంచి పలువురు మాజీ కౌన్సిలర్లు, నాయకులు టీడీపీలో చేరారు. జగన్నాథపురంలోని కొండబాబు నివాసంలో పార్టీలో చేరిన వారికి వనమాడి సత్యనారాయణ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మాజీ కౌన్సిలర్లు సిరియాల రాము, జోగా రాజు, నాయకులు గుండా సూరిబాబు, కాళ్లకూరి నాగేశ్వరరావు వారి అనుచరులతో టీడీపీలో చేరారు.

'టీడీపీతోనే బీసీలకు ప్రాధాన్యం'

ప్రత్తిపాడు, ఏప్రిల్ 12: టీడీపీతోనే బీసీలకు ప్రాధాన్యత, ఆదరణ ఉంటుందని ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన నాయి బ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో నాయిబ్రాహ్మణ సంఘ నాయకులు మెల్లిపాక నాగ సత్యనారాయణ, కామవరపు వరప్రసాద్, సుందరపల్లి గోపాలకృష్ణ, ఉత్తరపల్లి సోమరాజు, రాజారపు చక్రయ్య, రాంబాబులు మాట్లాడుతూ నాయిబ్రాహ్మణులకు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు కావడం లేదన్నారు. సత్యప్రభ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాయి బ్రాహ్మణుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రౌతులపూడి మండలం ఎస్.అగ్రహారానికి చెందిన 30 కుటుంబాలు వైసీపీని వీడి సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు కిలాడి వరహాలు, పక్కుర్తి నూకరాజుల ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ కొల్లు గోవిందరాజు, కొల్లు విజయ్‌కుమార్, ద్వారబంధం సూరిబాబు, వార్డుమెంబర్ ద్వారబంధ అప్పారావు, అప్పలరాజు, శ్రీను, గంగరాజు, చినగంగరాజు, సుర్ల వెంకటరత్న, పల్లం అప్పలరాజు, దేవుడు చేరిన వారిలో ఉన్నారు. పెదశంకర్లపూడిలో 40 కుటుంబాలు వైసీపీని వీడి సత్యప్రభ సమక్షంలో గ్రామ నాయకులు కిలాడి వరహాలు, పక్కుర్తి నూకరాజుల ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. సూర్యుడి సురేష్‌కుమార్, దలే నవీన్ పాల్గొన్నారు.

శంఖవరం: మా అమ్మను ఆశీర్వదించండి.. మా నాన్నా ఆశయానికి సహకరించండంటూ ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ తనయుడు వరుపుల తర్షిత్ కత్తిపూడిలో టీఎస్‌టీయూసీ ఉపాధ్యక్షుడు వెన్నా శివ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు బద్దిరామారావు, ఉల్లి వీరభద్రరావు, కిర్తి వెంకట సుభాష్, జనసేన నాయకులు కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్, పాకల ప్రసాద్, కంచిబొయిన శ్రీను పాల్గొన్నారు.

'నెహ్రూను గెలిపించండి'

జగ్గంపేట, ఏప్రిల్ 12: జగ్గంపేట శ్రీరామనగర్‌లో జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ తన తండ్రి టీడీపీ- జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి అయిన జ్యోతుల నెహ్రూను గెలిపించమని ఇంటింట ప్రచారం నిర్వహించారు. వైసీపీ పాలనలో జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కుంటుపడిందని, రాబోయే ఎన్నికల్లో కష్టపడి టీడీపీని అధికారంలోకి తెచ్చుకుంటే ప్రజా సమస్యలు తీరతాయన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, సత్తి సదాశివరెడ్డి, దాపర్తి సీతారామయ్య, పీల మహేష్, నేదూరి గణేష్, పలివెల ఏసురాజు, నండ్ల చిరంజీవి, దేగల సత్తిబాబు, ఎస్వీ ప్రసాద్, గంట రమణ, రాయిసాయి, కొండ్రోతు శ్రీను, వెలిశెట్టి బుజ్జి, రీసురవణ, ముక్కాపాలు బాబు పాల్గొన్నారు.

గండేపల్లి: జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత గండేపల్లి మండలం యర్రంపాలెం గ్రామంలో ఇంటింట ప్రచారం నిర్వహించి నెహ్రూను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తోట సర్వారాయుడు, దొడ్డిపట్ల బుజ్జి, జ్యోతుల సత్యమూర్తి, మండపాక శ్రీబాబు, పిండి బుజ్జి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'అత్యధిక మెజార్టీతో గెలిపించాలి'

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 12: పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న పవన్‌కల్యాణ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. పిఠాపురం మండలం కుమారపురం గ్రామంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రెండు ఓట్లు గాజుగ్లాసు గుర్తుపై వేయాలన్నారు. జనసేన పార్టీ తెలంగాణా ఇన్‌చార్జి శంకరగౌడ్, ఉపాధ్యక్షుడు మహేందరరెడ్డి తదితరులు ఉన్నారు.


జగ్గంపేటలో ప్రచారం చేస్తున్న నవీన్

పీవోలు, ఏపీవోలకు శిక్షణ కీలకం

» జిల్లా కలెక్టర్ నివాస్ » పలుచోట్ల అధికారులకు శిక్షణా తరగతులు



జగ్గంపేట: శిక్షణా తరగతుల పరిశీలనలో కలెక్టర్, కార్పొరేషన్: శిక్షణ ఇస్తున్న ఆర్వో

జగ్గంపేట, ఏప్రిల్ 12: ఆర్వోల ఆధ్వర్యంలో పీవోలు, ఏపీవోలకు నిర్వహిస్తున్న శిక్షణ చాలా కీలకమైందని జిల్లా కలెక్టర్ నివాస్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జగ్గంపేటలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో జగ్గంపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో 2రోజులు పాటు పోలింగ్ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణా తరగతులను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. పీవో, ఏపీవోలకు అందిస్తున్న శిక్షణ పట్ల పలు వివరాలు క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ మాస్టర్ ట్రైనీస్‌ని నియమించి ప్రతి ఒక్కక్లాస్‌రూమ్‌కి 30 మంది చొప్పున ఈవీఎం మిషన్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారన్నారు. ఈవీఎంని ఏ విధంగా వాడాలి, ఏ విధంగా పని చేస్తుంది, వాటిలో తాత్కాలిక సమస్యలు తలెత్తితే ఎలా పరిష్కరించాలితోపాటు వారు ఇవ్వాల్సిన ఫామ్స్‌పై వివరించారు. అంతకముందు ప్రభుత్వ డిగ్రీకళాశాల నందు ఆర్వో ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగ్గంపేటలో 4మండలాలకు సంబంధించిన తహశీల్దార్ల ఆధ్వర్యంలో బూత్ ఆఫీసర్లకు ఈవీఎంలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అధికారులతో పాటు సిబ్బందికి సలహాలు ఇచ్చారు.

ఎన్నికల సిబ్బంది పాత్ర కీలకం

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 12: రానున్న సాధారణ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంలో ఎన్నికల సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు అన్నారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో ఎన్నికల విధులపై ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆర్వో మాట్లాడుతూ తొలి విడత శుక్ర, శనివారాల్లో పీవో, ఏపీవోలకు శిక్షణ ఉంటుందన్నారు. విధి నిర్వహణలో ఉండే పోలింగ్ సిబ్బందికి ఎన్నికల నిర్వహణ, చట్టపరమైన, సాంకేతికపరమైన అంశాలు, ఈవీఎం, వీవీప్యాట్ల నిర్వాణపై సమగ్ర శిక్షణ ఇచ్చి సన్నద్ధం చేస్తామన్నారు. రెండో విడత ఈనెల 15, 16 తేదీల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు సమావేశంలో డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, తహశీల్దార్ చల్లన్నదొర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతుల ప్రారంభం


ప్రత్తిపాడు, ఏప్రిల్ 12: ఎన్నిల విధులు నిర్వహించే పీవో ఏపీవోలకు శుక్రవారం స్థానిక జడ్పీ హై స్కూల్ ప్రాంగణంలో 2 రోజులు పాటు నిర్వహించే శిక్షణా తరగతులను ఆర్వో ఏ.శ్రీనివాసరావు ప్రారంభించారు. పోలింగ్లో ఈవీఎంల వినియోగం వాటి పనితీరు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గంలోని తహశీల్దార్లు, మండల అధికారులు ఉన్నారు.

పీడీఎంఎస్ విధానంపై అవగాహన

పెద్దాపురం, ఏప్రిల్ 12: స్థానిక లూథరన్ హైస్కూల్లో పోల్ డే మానటరింగ్ సిస్టిం (పీడీఎంఎస్)పై పోలింగ్ సిబ్బంది శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో జె.సీతారామారావు ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనీలు పోలింగ్ సిబ్బందికి అవగాహన కల్పించారు. పోలింగ్ రోజు తీసుకోవాల్సిన చర్యలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

నియమావళి అమలుచేయాలి

కరప, ఏప్రిల్ 12: గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలని ఎంపీడీవో కొంకి అప్పారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా ఎక్కడా తాగునీటి సమస్య ఉత్పన్నమవకుండా చూసుకోవాలని సూచించారు. ఈవోపీఆర్డీ బసవరాజు సత్యనారాయణ ఉన్నారు.


కరప: సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

జగ్గంపేట, ఏప్రిల్ 12: శుక్రవారం విడుదలైన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ వేమగిరి శ్రీనివాసరావు తెలిపారు. కళాశాల ప్రథమస్థానంలో సెకండియర్ బైపీసీ ఈభాగ్య శ్రావణి 1000కి 877 మా ర్కులు, ద్వితీయస్థానంలో సీనియర్ సీఈసీ శ్రీనివాస్ 1000కి 853, కళాశాల తృతీయస్థానంలో సీనియర్ బైపీసీ 1000కి 776, హెచ్‌ఈసీలో ఎం.జ్యోతి 500కి 410, సీఈసీలో హెచ్ రామలక్ష్మి 500కి 388, ఒకేషనల్‌లో ప్రథమస్థానంలో జూనియర్ ఎంఎల్‌టీ జె.ప్రభాకర్ 500కి 434, సీనియర్ ఎంఎల్‌టీ దుర్గా సూర్యకుమారి 1000కి 836 మార్కులు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 105 మంది పరీక్షలకు హాజరుకాగా 41 మంది ఉత్తీర్ణులయ్యారని, ప్రథమ సంవత్సరం 289 మందికి 26 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.

కరప: వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్‌లో 60శాతం మంది, ఫస్ట్ ఇంటర్‌లో 47శాతం మంది ఉత్తీర్ణులైనట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో వడ్లమూరి వంశీసందీప్ 928 మార్కులతో కళాశాల టాప్‌గా నిలిచాడన్నారు. అలాగే 906 మార్కులతో వాసంశెట్టి రాజేష్ సెకండ్ ప్లేస్ సాధించాడన్నారు. ఫస్ట్ ఇంటర్ సీఈసీలో 459 మార్కులతో బరణికన అమృతవాణి టాప్ పొజిషన్‌లోను, 452 మార్కులతో సుంకర స్రవంతి సెకండ్ పొజిషన్‌లోను నిలిచారని వివరించారు. ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.


సామర్లకోట: పట్టణంలో పి.తులసి ఇంటర్ ఫలితాల్లో 986 మార్కులు సాధించి పట్టణంలో అగ్రగామిగా నిలిచారు. ఇంటర్ ప్రథమ పరీక్షల్లో ఎస్.సౌమ్యసుశీల, జి.రాజశ్రీలోకేష్ 463 మార్కులు సాధించి అగ్రగామిగా నిలిచారు. కెఎస్ఎన్ విద్యాసంస్థ ప్రిన్సిపాల్ ఆర్.రాధాకృష్ణ మాట్లాడుతూ తమ విద్యాసంస్థలో ఇంకా ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో తమ విద్యార్థులు డి.లక్ష్మీ సౌమ్య 462 మార్కులు, పి.జయశ్రీ 461 మార్కు లతో... ఇంటర్ ద్వితీయ పరీక్షల్లో ఎస్.విశిష్ట 982, ఎస్.దివ్య జీ.తనూశ్రీ, ఆర్.బాలగనిలక్ష్మి, బి.అరుణ్ కుమార్ 980 మార్కులతోనూ అగ్రగామిగా నిలిచారన్నారు.

కాకినాడ రూరల్: ఇంటర్ ఫలితాల్లో ప్రగతి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచి జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470 మార్కులకు గానూ సందీప్ 464, సూర్యవర్షిణి, నందిని, హరిణి 463 మార్కులు సాధించినట్లు ప్రగతి చైర్మన్ ఎన్.పూర్ణచంద్రరావు తెలిపారు బైపీసీలో 440 మార్కులకు దివ్య శ్రావణి, రత్నసాయి 434 పొందారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో సంతోషి వర్షిణి 1000 మార్కులకు గానూ 988, శ్రీవేణి 987, సుష్మ 987 సాధించారన్నారు.

కాకినాడ జోన్ శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 466,465,464 మార్కులు, బైపీసీలో 435,433 మార్కులు సాధించినట్లు శ్రీచైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎం.హరిప్రసాద్ తెలిపారు. అదే విధంగా సీనియర్ ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు 988, 987, 985, 984 ,982, 980 మార్కులు సాధించారన్నారు.


ఏలేశ్వరం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 30శాతం,సెకండ్ ఇయర్ 67శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజశేఖర్ తెలిపారు. సిరిపురం గ్రామానికి చెందిన కొత్త వినాదిని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయలో 988 మార్కులు సాధించింది.

'న్యాయం కోసం నల్లమిల్లి' కార్యక్రమం



కరప ఏప్రిల్ 12: అనపర్తి అసెంబ్లీ టికెట్‌ను టీడీపీకే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గత 10 రోజులుగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి చేపట్టిన న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమం శుక్రవారం పెదపూడి మండలం కుమారప్రియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లమిల్లి మాట్లాడుతూ ప్రజల నుంచి విశేషస్పందన లభిస్తుందన్నారు.

అంబేడ్కర్ జయంతిని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి


కొడవలిలో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ ప్రమోద్

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 12: గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ సూచించారు. గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామ ఎస్సీ కాలనీలో శుక్రవారం రాత్రి ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

టోఫెల్ పరీక్షా విధానం పరిశీలన


పెద్దాపురంలో పరిశీలిస్తున్న డీఈవో రమేష్

పెద్దాపురం, ఏప్రిల్ 12: స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో టోఫెల్ పరీక్ష విధానం అమలును డీఈవో పి.రమేష్ శుక్రవారం పరిశీలించారు. అలాగే నాడు- నేడు పనుల ప్రగతిని ఎంఈవోను అడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవో ప్రభాకరశర్మ తదితరులు ఉన్నారు.

ఘనంగా చండీహోమం


హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, ఏప్రిల్ 12: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలు అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పౌష్టికాహారం అందజేత

గండేపల్లి, ఏప్రిల్ 12: సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్తిపాడు పునరావాస కేంద్రం నందు గల ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం అందించడం కోసం పోషక విలువలు కలిగిన పప్పు దినుసులను పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రమేష్ తెలిపారు. సుమారు రూ.10వేలు విలువైన పౌష్టికాహారం ఏర్పాటు చేశామన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ఎం.రఘునాథ్, ఎస్.గోపిసాయిరామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

గండేపల్లి, ఏప్రిల్ 12: మండలంలో ఉప్పలపాడులో నూకాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాము సూరిబాబు ఆధ్వర్యంలో హోమాలు, ప్రత్యేక పూజలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. గండేపల్లిలో శుక్రవారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ వేడుక జరిగింది. సుబ్బారావు జ్ఞాపకార్థం భార్య లక్ష్మీ, ఆమె కుమారుల ఆర్థిక సహాయంతో పండితులు సత్తిబాబు శాస్త్రి మంత్రోచ్చారణలతో ప్రతిష్ఠ జరిగింది. భక్తులు హాజరై దర్శించుకున్నారు.

గంగాలమ్మ తల్లి ఆలయం ప్రారంభం

కరప, ఏప్రిల్ 12: వలసపాకల గ్రామదేవత గంగాలమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ వాసంశెట్టి రామారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు పాల్గొన్నారు.

బంగారు, వెండి పుష్పాలతో అర్చన

పెద్దాపురం, ఏప్రిల్ 12: మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం శుక్రవారం దేవస్థానం వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించామని దేవస్థానం సహాయ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు.

విశ్రాంత ఉద్యోగికి సన్మానం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 12: ప్రత్తిపాడుకి చెందిన విశ్రాంత ఉద్యోగి బేతా ఈశ్వరరావు పదవీ విరమణ అనంతరం ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అంశంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందిన సందర్భంగా శుక్రవారం స్థానిక పెద్దలు సింగిలిదేవ్ సత్తిరాజు, రాజా కింగ్‌బాబురాజులు సన్మానించారు. దిడ్డి వెంకటరమణ, సింగిలిదేవ్ అప్పారావు, ఉపసర్పంచ్ మదినే నూకరాజు,మదినే బాబ్జి, సేంద్రపు సుబ్బన్న ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జగ్గంపేట, ఏప్రిల్ 12: స్థానిక కాకినాడ రోడ్లో గల బాలాజీ జ్యూయలర్స్ వద్ద జగ్గంపేట వాసవిక్లబ్, ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. జగ్గంపేట ఆర్యవైశ్య సేవ సంఘం అధ్యక్షుడు, జిల్లా వాసవి క్లబ్ ప్రోగ్రాం ఆఫీసర్ కొత్త కొండబాబు ముఖ్య అతిథి ప్రారంభించి మంచినీళ్ళు, మజ్జిగ పంపిణీ చేశారు. మానేపల్లి బంగార్రాజు, వెంట్రా ప్రగడ గణేష్, కొత్త నాగపండు, మానేపల్లి రామానుజం, కాకి ఆనంద్, పొట్టి రాజేష్, కాకి విజయ్ కుమార్, వి.వెంకటేశ్వరరావు, మాతంశెట్టి సాయిబాబా, ఉద్దగిరి కామేశ్వరరావు,ఆర్యవైశ్య సేవా సంఘం సభ్యులున్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం